సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



రైతులకు అండగా బీఆర్‌ఎస్‌..

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 7లో



రెగ్యులరైజ్‌ చేయాలి

హామీలు అమలు చేయాలని జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. - 7లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31°/23°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

భువనగిరి : వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం భువనగిరిలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ పద్ధతిని పునరుద్ధరించాలని, కేజీబీవీ, మోడల్‌, గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. టీఎస్‌ యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుటుంబ సంక్షేమ నిధి పథకాన్ని ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల దామోదర్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి యాదయ్య, కోశాధికారి మల్లేశం, కార్యదర్శులు రాజగోపాల్‌, ముత్యాలు, సుధర్మారెడ్డి, మమత, వెంకట్‌రెడ్డి, రవికుమార్‌, బాలయ్య, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పోచంపల్లిని సందర్శించిన ఎంబీఏ విద్యార్థులు



రాట్నంతో నూలు వడికే విధానాన్ని తెలుసుకుంటున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : హైదరాబాద్‌లోని కస్తూరిబాగాంధీ బాలికల కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా శనివారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. టూరిజం పార్కు, చేనేత గృహాలను సందర్శించారు.మగ్గాలపై తయారవుతున్న ఇక్కత్‌ వస్త్రాలు, వాటిని తయారీ ప్రక్రియలను పరిశీలించారు. కార్మికులకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్‌ గురించి తెలుసుకున్నారు. వారికి చేనేత పరిశ్రమత, భూదానోద్యమ చరిత్ర గురించి గైడ్‌ గునిగంటి సుభాష్‌ వివరించారు.

రైతును వీడని వాన



వలిగొండ మండలం ప్రొద్దుటూర్‌ ఐకేపీ కేంద్రంలో వర్షపు నీటిలో నుంచి ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు పెద్దబోయిన శ్రీను దంపతులు



బీబీనగర్‌ మండలం రహీంఖాన్‌గూడెం పరిధిలో బునాదిగాని కాల్వకు గండి పడడంతో పొలాల్లోకి చేరిన వరద నీరు

అకాల వర్షంతో మరోసారి నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- బునాదిగాని కాల్వకు గండి.. నీట మునిగిన పొలాలు
- విద్యుత్‌ తీగలు తెగిపడి ఆవులు మృతి
- భువనగిరి పట్టణంలోని విద్యానగర్‌లోకి చేరిన వరద నీరు
- యాదాద్రిలో భక్తుల తిప్పలు

భువనగిరి, వలిగొండ, మోటకొండూరు, యాదగిరిగుట్ట : అన్నదాతను అకాల వర్షాలు వీడడం లేదు. జిల్లాలో శనివారం ఉదయం ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో బీభత్సం సృష్టించింది. రైతన్నకు తీవ్ర నష్టం కలిగించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. కోత దశలో ఉన్న వరి నేలకొరిగింది. మోటకొండూరు మండలంలో కరెంట్‌ తీగలు తెగిపడి పాడి ఆవులు మృతి చెందాయి. బీబీనగర్‌ మండలం రహీంఖాన్‌గూడెం పరిధిలో బునాదిగాని కాల్వకు గండి పడి పొలాల్లోకి నీరు చేరింది.

మండలాల వారీగా నష్టం ఇలా..

భువనగిరి మండల వ్యాప్తంగా ఆకాల వర్షం కురిసింది. నందనం, తుక్కాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో సుమారు 200వరకు ధాన్యం బస్తాలు తడిసాయి. భువనగిరిలో డ్రెయినేజీలు పొంగిపొర్లాయి, ప్రధాన రహదారులపై వరద నీరు ప్రవహించింది. విద్యానగర్‌లో ఇళ్లలోకి డ్రెయినేజీ చేరింది. దీంతో నవదోయ పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

వలిగొండలో.. మండల వ్యాప్తంగా మెజార్టీ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం చాలా వరకు తడిసిపోయింది. కొన్ని చోట్ల వరద నీటిలో కొట్టుకుపోయింది. వరి చేలు నేలకొరిగాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



బునాదిగాని కాల్వ కట్ట తెగడంతో వృథాగా పోతున్న నీరు

యాదగిరిగుట్టలో.. పట్టణంలో సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు రావడంతో విద్యుత్‌ అధికారులు అప్రమత్తమై కరెంట్‌ సరఫరా నిలిపివేశారు. కాలనీల్లో ఓపెన్‌ డ్రెయినేజీలు నిండి రహదారులపై వరద నీరు ప్రవహించింది. కొన్ని కాలనీల్లో ఇళ్ల ఎదుట పెద్ద ఎత్తున నీరు చేరింది. యాదాద్రికి వచ్చిన భక్తులు వర్షంలో ఇబ్బంది పడ్డారు.

మోటకొండూర్‌లో.. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో రోడ్డుపై పెద్ద ఎత్తున వరద నీరు పారడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి.

బీబీనగర్‌ : మండలంలోని రహీంఖాన్‌గూడెం పరిధిలోని బునాదిగాని కాల్వకు వరద తాకిడి పెరగడంతో కాల్వకు గండి పడింది, దీంతో కాల్వ ఆయకట్టులోని పొలాలు నీట మునిగాయి. అలాగే లక్ష్మీదేవిగూడెం, బ్రహ్మణపల్లి, చిన్నరావులపల్లి, భట్టుగూడెం గ్రామాల్లో పంట పొలాల మీదుగా చెరువులు, కుంటల నుంచి వచ్చిన నీళ్లు, వరద నీరు ప్రవహించింది. కాల్వకు గండి పడి విషయాన్ని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలచందర్‌ ఇరిగేషన్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కుప్పలు పూర్తిగా తడిశాయి.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. సుప్రభాతం చేపట్టారు. అనంతరం ఆరాధన, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన గావించారు. ఇక ఆలయ ముఖమండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన చేశారు. మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ నిర్వహించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



స్వామివారికి హారతినిస్తున్న ఉప ప్రధానార్చకులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

చౌటుప్పల్‌ : పట్టణంలో రెండు బహుళ అంతస్తుల భవనాలను మున్సిపల్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు కూల్చివేశారు. పోలీస్‌స్టేషన్‌ పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన సుర్వి అంజయ్యగౌడ్‌కు చెందిన ఐదు అంతస్తుల భవనంలో పై రెండు ఫ్లోర్లను ధ్వంసం చేశారు. అదే విధంగా అగ్నిమాపక కేంద్రానికి వెళ్లే దారిలో మొహ్మద్‌ రఫీకి చెందిన ఐదు అంతస్తుల భవనం పైఫ్లోర్‌ను కూల్చివేశారు. అనుమతులు తీసుకోకుండా భవనాలను నిర్మించినందున వాటి యజమానులకు ఇప్పటికే మున్సిపల్‌ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా వారు స్పందించకపోవడంతో టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్‌ కమిటీ ఆదేశాల మేరకు మున్సిపల్‌, ఐబీ, ఫైర్‌, పోలీస్‌ అధికారులు శనివారం తెల్లవారుజామున భవనాల కూల్చివేతలు ప్రారంభించారు.





భవనాల పై అంతస్తులను కూల్చుతున్న సిబ్బంది

చైర్మన్‌పై ఆరోపణలు

అనుమతులు లేవన్న సాకుతో భవనాలు కూల్చివేయడం తగదని, దీనికి మున్సిపల్‌ చైర్మన్‌ బాధ్యత వహించాలని సుర్వి అంజయ్యగౌడ్‌ సోదరుడు, కాంగ్రెస్‌ పార్టీ మున్సిపల్‌ కమిటీ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్‌ పేర్కొన్నారు. అనుమతుల పేరిట తన సోదరుడి వద్ద చైర్మన్‌ రూ.15 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. చైర్మన్‌పై నర్సింహగౌడ్‌ చేసిన ఆరోపణలను ఆ వెంటనే ఉపసంహరించుకోవడం చర్చనీయాంశమైంది.

యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో హెల్ప్‌ డెస్క్‌

యాదగిరిగుట్ట : అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో యాదగిరిగుట్ట మున్సిపల్‌ కార్యాలయంలో శనివారం హెల్ప్‌డెస్క్‌ ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. పారిశుద్ధ్యం, విద్యుత్‌ సరఫరాలో ఏ సమస్య వచ్చినా హెల్ప్‌డెస్క్‌కు సమాచారం అందజేయాలని ఇన్‌చార్జ్‌ కమిషనర్‌ చక్రపాణి, చైర్‌పర్సన్‌ సుధాహేమేందర్‌గౌడ్‌ పేర్కొన్నారు. శానిటేషన్‌ కోసం 9182601092, 8977538819, 728683115 నంబర్లు, వీధి దీపాలు, విద్యుత్‌ సరఫరాకు 9550171090, 8977538819 లకు సమాచారం అందజేయాలన్నారు.

నేడు బీసీ గురుకుల కళాశాలల పరీక్ష

- 6 కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 1,500 మంది విద్యార్థులు

భువనగిరి : 2023 - 24 విద్యా సంవత్సరానికి గాను మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల ఇంటర్‌, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణకు 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1500 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు పరీక్ష జరగనుంది.పర్యవేక్షణకు సీఎస్‌, డీవోలతో పాటు ఇన్విజిలేటర్లను నియమించారు.

కేంద్రాలు ఇవే..

జిల్లా కేంద్రంలో శ్రీగాయత్రి బాలికల జూనియర్‌ కళాశాల, టైమ్‌, వాగ్దేవీ, శ్రీచైతన్య, ఎస్‌ఎస్‌ఆర్‌ ఒకేషనల్‌ జూనియర్‌ కళాశాల, సాయికృప డిగ్రీ కాలేజీలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్‌ 181, డిగ్రీ 1,319 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని, మాస్కులు ధరించి రావాలని పరీక్షల కన్వీనర్‌ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. ఎలక్ట్రానిక్‌ వస్తులకు కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. బ్లూ లేదా బ్లాక్‌ బాల్‌పాయింట్‌ పెన్నుతో మాత్రమే జవాబులు రాయాల్సి ఉంటుందన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

- జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బీకునాయక్‌



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బీకునాయక్‌

భువనగిరిటౌన్‌ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బీకునాయక్‌ సూచించారు. శనివారం జిల్లా పరిషత్‌ కార్యాలయంలో 3వ స్థాయీ సంఘ సమావేశం (వ్యవసాయం) జెడ్పీ వైస్‌ చైర్మన్‌ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్‌లో 3.33లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, 6 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, పూర్తిగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. తుర్కపల్లి మండల పరిధిలో క్రషర్‌ మిల్లులు పెద్ద ఎత్తున ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్రషర్లపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బొమ్మలరామారం, తుర్కపల్లి, భువనగిరి మీదుగా అధిక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను నియంత్రించాలని సూచించారు. జిల్లా మత్స్య శాఖ అధికారి రాజారాం మాట్లాడుతూ జిల్లాలో మృగశిర కార్తె రోజున ఫిష్‌ ఫుడ్‌ ఫెస్టివల్‌ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా అధికారులు సమాచారం ఇవ్వకుండా సమావేశాలకు గైర్హాజరైతే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు, జెడ్పీటీసీ బీరుమల్లయ్య పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి

యాగిరిగుట్ట జెడ్పీటీసీ తోటకూరి అనురాధ అధ్యక్షతన 6వ స్థాయీ సంఘ సమావేశం జరిగింది. రానున్న విద్యాసంవత్సరంలో వసతిగృహాలను ప్రారంభించడానికి ముందే అన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.

వేసవి జాగ్రత్తలు పాటించండి : జెడ్పీటీసీ గోళి ప్రణీత

బీబీనగర్‌ జెడ్పీటీసీ గోళి ప్రణీత అధ్యక్షతన జరిగిన ఐదవ స్థాయీ సంఘ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, చిన్నారుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని, ఇక్కపై తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు.

క్లుప్తంగా

అదుపుతప్పి కారు బోల్తా

• డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం



రహదారి పక్కన బోల్తా కొట్టిన కారు

నకిరేకల్ : నకిరేకల్ మండలం నెల్లిబండ శివారు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కారు బెలూన్లు తెరుచుకోవడంతో డ్రైవర్ ప్రాణాలతో క్షేమంగా బయటపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మద్దిరాలకు చెందిన ఎల్లోల వెంకట్‌రెడ్డి కారులో దేవరకొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో నకిరేకల్ మండలం నెల్లిబండ శివారులోకి రాగానే కారు అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. బెలున్లు ఓపెన్ అయి డోర్లు తెరుచుకోవడంతో డ్రైవింగ్ సీటులో ఉన్న వెంకట్‌రెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈప్రమాదంలో కారులోని వస్తువులు బయటపడిపోయాయి. ఈదారి గుండా వెనుక నుంచి వస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య వెంకట్‌రెడ్డికి ధైర్యం చెప్పి మంచి నీరు తాగించారు. బయటపడ్డ వస్తువులన్నీ భద్రపరిచి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వెంకట్‌రెడ్డిని తీసుకెళ్లారు.

గీత కార్మికుడికి గాయాలు

మాడుగులపల్లి: తాటిచెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడు గాయపడ్డాడు. మండలంలోని కుక్కడం గ్రామంలో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎలుగూరి జానయ్య కల్లు గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా సాయంత్రం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. దిగుతుండగా మోకు జారి కిందపడడంతో గాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాధితుడిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మళ్లీ వర్షం.. తడిసిన ధాన్యం



తిరుమలగిరి మార్కెట్‌లో వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యాన్ని దగ్గరకు చేస్తున్న రైతులు



భువనగిరి మండలం నందనం గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు



తిరుమలగిరి మండలం తాటిపాముల ఐకేపీ కేంద్రంలో నిలిచిన నీళ్లు



శాలిగౌరారం: మార్కెట్‌యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం



శాలిగౌరారం: మార్కెట్‌యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతులు

శుభ ముహూర్తాలు వచ్చేశాయ్ !

• మే 3నుంచి మోగనున్న భాజాభజంత్రీలు
• వచ్చే రెండు నెలల్లో 23 మంచి రోజులున్నాయంటున్న అర్చకులు



అర్వపల్లి : శుభ ముహూర్తాలు వచ్చేశాయి. గురు మూఢం కారణంగా నెల రోజులుగా నిలిచిపోయిన శుభకార్యాలు మే 3వ తేదీ నుంచి మొదలు కానున్నాయి. పల్లెపల్లెనా భాజాభజంత్రీలు మోగనున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అప్పుడే పెళ్లి సందడి నెలకొంటోంది. పెళ్లి సామగ్రి దుకాణాలు కొనుగోలు దారులతో కళకళలాడుతున్నాయి. పెళ్లి మండపాలు ముస్తాబవుతున్నాయి.శుభలేఖల ప్రింటింగ్ పనులు పూర్తి కాగా వంటవారు, భాజాభజంత్రీల వారు, పురోహితులు అంతా సిద్ధమవుతున్నారు.

శుభముహూర్తాల తేదీలు ఇలా..

మే 3 నుంచి వరుసగా 4,5,6,7,8,10,11,12,13, 21,26,27,28,30,31 తేదీల్లో శుభ ముహూర్తాలు జరగనున్నాయి. అలాగే జూన్‌లో 1,3,7,8,9,10,11 తేదీల్లో ముహూర్తాలు ఉండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలసంఖ్యలో శుభకార్యాలు జరగనున్నాయి. కాగా, జూన్ 19నుంచి ఆషాఢమాసం మొదలై, జులై మొత్తం అధిక శ్రావణం కావడంతో ఆగస్టు 18వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఆగస్టు 19న మంచిరోజులు ప్రారంభమై డిసెంబర్ 31వరకు బాగున్నాయి. అయితే పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారు, వస్త్ర దుకాణాలు, పెళ్లి వస్తువుల దుకాణాలు రద్దీగా మారాయి. ఇదిలా ఉంటే ఏప్రిల్‌లో పూర్తిగా శుభకార్యాలు లేక ఆయా వర్గాల వ్యాపారులు ఎంతో నష్టపోయారు. కాగా, మే 3నుంచి శుభ ముహూర్తాలు ఉండటంతో శుభకార్యాల నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఫంక్షన్‌హాల్‌లు ముందస్తుగా బుక్ అయ్యాయి. ఈసారి ఎక్కువ ముహూర్తాలు ఉండటంతో వేద బ్రాహ్మణులు, బ్యాండ్ మేళం, సౌండ్ సిస్టమ్, లైటింగ్, డెకరేషన్, క్యాటరింగ్, వంటలు చేసేవారు, ఈవెంట్ ఆర్గనైజర్లు, వివిధ రకాల వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2నెలల్లో 23రోజులు



ఏప్రిల్ నెల మొత్తం ముహూర్తాలు లేకపోవడం వల్ల చాలా పెళ్లిళ్లు మే, జూన్ నెలలో ఉన్న మంచిరోజుల్లో జరగనున్నాయి. ఈ రెండు నెలల్లో 23రోజుల వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. జులై నెలలో మంచి రోజులు లేవు. తిరిగి ఆగస్టు 19నుంచి మంచి రోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

– మోత్కూరి రాజుశర్మ, పురోహితుడు, అర్వపల్లి

పెరుగుతున్న మూసీ ప్రాజెక్ట్ నీటిమట్టం



మూసీ రిజర్వాయర్

కేతేపల్లి : జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది యాసంగిలో ఆయకట్టులో పంటల సాగుకు నీటి విడుదల నిలిపివేసే నాటికి మూసీ రిజర్వాయర్‌లో నీటి మట్టం 625 అడుగులకు (గరిష్ట నీటిమట్టం 645 అడుగులు) తగ్గిపోయింది. హైదరాబాద్, మూసీ పరీవాహక ప్రాంతాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మూసీలోకి ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా ఒక్కో అడుగు పెరుగుతూ శనివారం సాయంత్రానికి 630 అడుగులకు చేరుకుంది. శనివారం మూసీకి ఎగువ నుంచి 1,325 క్యూసెక్కు ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. 4.46 టీఎంసీల గరిష్ట నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.52 టీఎంసీల నీరు నిల్వ ఉందని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట కుచ్చుటోపీ



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు



బాధితులకు ఇచ్చిన నకిలీ ఐడీ కార్డులు

• ఏడుగురి నుంచి రూ.42.50లక్షలు వసూలు
• న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన బాధితులు

మిర్యాలగూడ : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ చానల్ విలేకరి ఏడుగురు బాధితుల నుంచి రూ.42.50లక్షలు వసూలు చేసి కుచ్చుటోపీ పెట్టాడు. మిర్యాలగూడలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన కోదాటి శ్రీనివాస్ ఓ చానల్‌లో విలేకరిగా పనిచేస్తున్నాడు. రైల్వే, న్యాయ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని స్నేహితులు, ఇతరుల వద్ద డబ్బులు వసూలు చేశాడు. వేములపల్లి మండలం రావులపెంటకు చెందిన కందుల నాగిరెడ్డి కుమారులు వినయ్‌రెడ్డి, విజయ్‌సాగర్‌రెడ్డిలకు రైల్వేశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని 2017లో రూ.3లక్షలు, రూ.2020లో రూ.8లక్షలు, 2021లో రూ.5లక్షలు మొత్తం రూ.16లక్షలు వసూలు చేశాడు. రైల్వే శాఖ నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించి ఉద్యోగాలు వచ్చాయని నమ్మబలికి వారితో ఆయా రైల్వే స్టేషన్లలో పనులు చేయించాడు. రెండు నెలలపాటు బ్యాంకుల్లో జీతాలు కూడా జమ చేశాడు. దీన్ని నమ్మిన మరికొందరు మంగాపురానికి చెందిన జెర్రిపోతుల జానకిరాములు వద్ద రూ.4లక్షలు, మిర్యాలగూడ పట్టణానికి చెందిన జటావత్ శంకర్‌నాయక్ (రూ.లక్ష), వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బొడ్డు సందీప్11లక్షలు, అదే గ్రామానికి చెందిన బొమ్మగాని జానకిరాములు రూ.లక్ష, చివ్వెంల మండలం వట్టిఖమ్మంపాడు గ్రామానికి చెందిన వీరమళ్ల మహేష్ రూ.9.50లక్షలు మొత్తంగా రూ.26.50లక్షలు వసూలు చేశాడు. ఉద్యోగాలు నకిలీవని తేలడంతో అప్రమత్తమైన బాధితులు ఇటీవల వేములపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డబ్బు తిరిగి ఇవ్వాలని బాధితులు శ్రీనివాస్‌పై పలుమార్లు ఒత్తిడి చేయగా తాను ఇవ్వలేనంటూ ఏం చేసుకుంటారో చేసుకోమంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో గత్యంతరం లేక శనివారం డీఎస్పీని ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

‘కృష్ణవేణి’ విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణవేణి యజమాన్యం, సిబ్బంది

ఖమ్మం సహకారగర్: జేఈఈ మెయిన్స్–2 ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపుడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని కళాశాలలో శనివారం వారు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. తమ విద్యార్థులు బి.అరవింద్ 54, టి.నేహాశ్రీ 186, ఎస్.కే.సుభానీ 280, టి.జనేషు 367, ఎస్.వెంకట సాయితేజ 472, టి.పవన్ 823, డి.మనోజ్ 897, పి.రవిశంకర్ 1,201, బి.కల్యాణ్ 1,357, బి.కిరణ్ 1,535, బి.బాబా 1,596, జె.సోని 1,957, నిఖిలశ్రీ 2,197, ఆర్.చంటి 2,229, బి.యశ్వత 2,864, కె.అనుశ్రీ 3,143, బి.అమిత 3257, బి.మహేష్ 3,363, జి.చైతన్య 3,365, పి.అస్మిత 3,593, బి.తులసి ప్రియ 3,614, బి.శివరామకృష్ణ 4,149, జి.దేవేందర్, 4,187, బి.కార్తీక్ 4,502, సిరిబాయి 4,556, జి.సిద్ధు 4,851 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, అకడమిక్ డీన్ శేఖర్‌బాబు, ఇన్‌చార్జ్ వంశీకృష్ణ, ఏఓ నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య అగ్రగామి ఫలితాలు



మాట్లాడుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్–2లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో అగ్రగామి ఫలితాలు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఖమ్మంలో శనివారం వారు మాట్లాడుతూ మొత్తంగా 541 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. బి.నిషాగోపిక 16వ ర్యాంక్ సాధించగా, టి.హర్షవర్ధన్ 70, బి.సాయిబాలాజీ 78, జి.మణిప్రకాష్ 79, ఎ.ఇందురెడ్డి 104, వి.భానుప్రసన్న 129, బి.వివేక్ వర్ధన్‌వర్మ 149, ఎం.ఉపేందర్ 258, బి.పవన్‌కార్తీక్ 275, ఎస్.జశ్వంత్‌సాయి 297, కె.శివగుప్త 370, బి.మదన్‌లాల్ 431, బి.జగదీశ్ 496, ఎం.వంశీ 556, బి.భానుప్రకాష్ 598, బి.సాత్విక్ 610, బి.వెన్నెల 665, ఎ.యశ్వంత్ 718, ఆర్‌బీ రాంచరణ్ 785, జె.ప్రణీత్ 854, బి.వేణు 892, బి.పూజిత 948, వి.గణేశ్ 1,124, ఐ.మహీందర్‌వర్మ 1,319, పి.హర్షిత్‌చౌదరి 1,353, బి.సింధు 1,391, బి.కీర్తన వర్మ 1,447వ ర్యాంక్ సాధించారని చెప్పారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు సాయిగీతిక, సీహెచ్ చేతన్‌మాథుర్, డీన్ వర్మ, ఏజీఎంలు బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ .. డ్రైవర్‌కు గాయాలు

• చిట్యాలలో ట్రాఫిక్‌కు అంతరాయం

చిట్యాల: రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిట్యాల పట్టణంలో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ వైపు నుంచి వస్తున్న లారీ చిట్యాల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న జంక్షన్ వద్ద భువనగిరి రోడ్డు వైపునకు మళ్లుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న లారీ అదుపు తప్పడంతో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదంలో ఓ లారీలోని డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. రెండు వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే పోలీసులు క్రేన్ సహాయంతో రోడ్డుపై నిలిచిపోయిన లారీలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటికి తీశారు. అతడికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికంగా చికిత్స చేయించారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్

సంస్థాన్ నారాయణపురం: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ యుగంధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పెద్దగోని రాజు కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి వద్ద నుంచి రూ.20వేల నగదు, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ కట్టిన మరో ముగ్గురు వ్యక్తులపై కూడా తెలంగాణ గేమ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘నవోదయ’ పరీక్షకు 89.20 శాతం హాజరు



పెద్దవూరలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సీఎస్ శ్రీనివాస్

పెద్దవూర: పెద్దవూర మండలం చలకుర్తి క్యాంపులో నిర్వహిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 89.20 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీ.ఏ.ఎస్. స్వర్ణలత తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసి 33 కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 3,599 మందికి గాను 3,194 మంది, సూర్యాపేట జిల్లాలో 2,005 మందికి గాను 1,803 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 945 మందికి గాను 845 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మొత్తం 80సీట్లకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,549 మంది విద్యార్థులకు గాను 5842 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. దీంతో ఒక్క సీటుకు 73 మంది విద్యార్థులు పోటీ పడుతున్నట్లు వెల్లడించారు.

చర్లగౌరారం ఐకేపీ కేంద్రం నిర్వాహకులపై కేసు



ఐకేపీ సెంటర్‌లో కాంటాను పరిశీలిస్తున్న అధికారి రామకృష్ణ

కనగల్: అధిక తూకం వేస్తున్నారనే అభియోగం మేరకు మండల పరిధిలోని చర్లగౌరారం గ్రామంలోని ఐకేపీ కేంద్రం నిర్వాకులపై శనివారం లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన నిమ్మల సత్తిరెడ్డి, కాసాని నాగరాజు నుంచి ధాన్యం తూకం అధికంగా వేసారని ఫిర్యాదు చేయడంతో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడిక్కడే వారి ధాన్యం సంచులను మళ్లీ ఓ ప్రామాణిక ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ మీద తూకం వేయగా ఒక్కొక్క బస్తాకు 1.5కేజీల నుంచి 2.5కేజీల వరకు అధికంగా తూకం వేసారని శాఖ అధికారి నిర్ధారించారు. రైతుల వద్ద నుంచి 40కేజీల ధాన్యం, అంతకు మించి బస్తా బరువు కలిపి తూకం వేయాల్సి ఉండగా వారు అధిక తూకం వేయిస్తున్నందుకు గాను ఐకేపీ నిర్వాహకులపై(చర్లగౌరారం సంఘంబంధం సభ్యులు) లీగల్ మెట్రాలజీ చట్టం కింద కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వారు ధాన్యాన్ని సేకరించేటప్పుడు అధిక తూకం వేసినా, ప్రామాణికం కాని వేయింగ్ మిషన్‌లను వాడినా వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ హెచ్చరించారు.

అయ్యప్ప ఆలయంలో చోరీకి యత్నం



సీసీ ఫుటేజీలో రికార్డయిన వ్యక్తి ఫొటో

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ మిల్‌కాలనీలోని అయ్యప్ప ఆలయంలో శనివారం ఓ వ్యక్తి చోరీకి యత్నించాడు. సాగర్ ఎస్‌ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి అయ్యప్ప ఆలయంలోకి వెళ్లి దొంగతనం చేయడానికి ప్రయత్నించాడు. సీసీ కెమెరాలో అతడి కదలికలు రికార్డయ్యాయి. ఆలయ పాలకవర్గం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడి అరెస్ట్

• కుటుంబ సభ్యులకు మైనర్ అప్పగింత

బొమ్మలరామారం : బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మైనర్‌ను క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా బంటువారం మండలం తురుమామిడి గ్రామానికి చెందిన రావులపల్లి నర్సింహులు కొంతకాలంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం హర్దాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఓ తోటలో పనిచేస్తున్నాడు. కాగా, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కూడా హర్దాస్‌పల్లి గ్రామానికి వ్యవసాయ కూలి పనులకు వెళ్తుండేది. ఈ క్రమంలో నర్సింహులు ఆ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. బాలికకు మాయమాటలు చెప్పి ఈ నెల 23న కిడ్నాప్ చేసి వెంట తీసుకెళ్లాడు. మైనర్ కుటుంబ సభ్యులు నర్సింహులుపై అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. నర్సింహులును అతడి స్వగ్రామంలోనే అరెస్ట్ చేసి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వెంకన్న వివరించారు.

ఖైనీ ఇవ్వనందుకు చంపేశాడు !

• వీడిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కార్మికుడి హత్య కేసు మిస్టరీ
• తోటి కార్మికుడే నిందితుడు.. అరెస్ట్ చేసిన పోలీసులు
• కేసు వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్: దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ శివారులో ఇటీవల వెలుగుచూసిన యాదాద్రి థర్మల్ ప్లాంట్ కార్మికుడి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. తోటి కార్మికుడే మద్యం మత్తులో ఖైనీ (తంబాకు) ఇవ్వనందుకు బండరాయితో మోది దారుణంగా హత్యచేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. శనివారం తన కార్యాలయంలో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టి మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 11గంటల సమయంలో పవర్ ప్లాంట్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడనే సమాచారంతో మిర్యాలగూడ రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హతుడు దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో కార్పెంటర్‌గా పనిచేసే ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రఘునందన్ రామ్‌గా గుర్తించారు. ఎస్పీ అపూర్వరావు పర్యవేక్షణలో డీఎస్పీ వెంకటగిరి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రఘునందన్‌రామ్, బిహార్ రాష్ట్రం నవాడి గ్రామానికి చెందిన ఓంప్రకాశ్‌గుప్తాలు పవర్‌ప్లాంట్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరిద్దరు మద్యానికి బానిసగా మారి పనిచేయగా వచ్చిన కూలి డబ్బులతో ప్రతి రోజు మద్యం తాగుతూ ఉండేవారు. ఈ నెల 23న ఇద్దరు వారి కూలి డబ్బులు తీసుకుని పూటుగా మద్యం తాగి డ్యూటీకి వెళ్లకుండా తిరుగుతున్నారు.

మద్యం మత్తులో బండరాయితో మోది

ఈ క్రమంలో 25వ తేదీన పవర్‌ప్లాంట్ ప్రహరీ వెనుక ఇద్దరు మద్యం తాగారు. అనంతరం తనకు ఖైనీ ఇవ్వాలని ఓంప్రకాశ్ గుప్తా అడగ్గా ఇవ్వను అని రఘునందన్‌రామ్ మొండికేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన ఓంప్రకాశ్‌గుప్తా బండ రాయితో రఘునందన్‌రామ్ తలపై బలంగా మోదడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు, పలు సాంకేతిక అంశాలను పరిగణలోకి తీసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు రవికుమార్, నరసింహులు హరిబాబు, సురేష్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ ఇంకేసార్ అహ్మద్, ఎస్.గోపయ్య, కానిస్టేబుళ్లు రాజారం, సతీష్, భాస్కర్, ఖయ్యూం, వెంకట్‌ను డీఎస్పీ అభినందించారు.